# కలం సునామి

"హాస్య రచన చేయడమంటే మాటలు కాదోయ్. ఇప్పుడు వచ్చే హాస్య రచనలు చదివేటప్పుడు పక్కన ఎవరైనా ఉండి గిలిగింతలు పెట్టాల్సిందే అంత దారుణంగా ఉంటున్నాయి నేటి కామెడీ రచనలు," అంటూ నవ్వేస్తున్నాడు వి.కే.మార్క్

"నిజమేననుకో మరి ఇంత బాగా చాలా రచనలు చేస్తున్నవ్ కదా.ఒక్కటి కూడా ఏ పత్రికలోనూ ప్రచురింపబడకపోవడంలో రహస్యం ఏమిటంటావ్? అన్నాడు ఎప్పుడు మార్క్ ఇంటికి వచ్చే సుబ్బారావు. అతను మార్క్‌కి చిన్ననాటి స్నేహితుడు. తన మిత్రుడు ఎప్పటికైనా గొప్ప రచయిత అయితే వాడూ నేను బాల్య మిత్రులం అని గొప్పగా చెప్పుకోవచ్చని పాపం సుబ్బారావు కోరిక. "చూడవోయ్, నా రచన ప్రచురించడం వలన ఆ పత్రిక సర్క్యులేషన్ విపరీతంగా పెరుగుతుంది అంతే కాకుండ పాఠకుల మెయిల్ కూడా అధికమవుతుంది. ఇది వాళ్ళు గ్రహించక పోవడం దురదృష్టకరం. కానీ చూడు సుబ్బా, నేను ఎప్పటికైనా నెంబర్-1 రైటర్‌ని అవుతాను-" అన్నాడు వి.కే.మార్క్

వి.కే.మార్క్ చిన్నా పెద్దా కాని ఆ ఊళ్ళో గత దశాబ్దంగా రచనలు చేస్తూ, రచనలు చేస్తాడనే పేరు సంపాదించాడు. పొలం పుట్రా, పాడీ పంటా, మేడ గిడా, బాగా డబ్బు ఉండడంతో ఈ రచనా కార్యక్రమాన్ని హాబీగా పెట్టుకున్నాడు. తన పేరుతో రచనలు పంపిస్తే ఏం బావుంటుంది అలా కాకుండా కలం పేరు పెట్టుకుంటే బాగుంటుందని అతను తన మొదటి రచన నుంచీ కలం పేరే వాడుతున్నాడు. అశ్వని నుండి రేవతి వరకూ నక్షత్రాల పేర్లు, చైత్రం నుండి ఫాల్గుణం వరకు తెలుగు నెలల పేర్లు, ప్రభవ నుండి అక్షయ వరకు తెలుగు సంవత్సరాల పేర్లూ, రంభ, ఊర్వశి, మేనక, జయసుధ, జయప్రద, జయచిత్ర, మొదలైన సినీ తారల పేర్లతో సహా ఇంకా ఎన్నో అతని కలం పేర్లు అయికూర్చున్నాయి. ఒక్కో రచన పంపేటప్పుడు ఒక్కోకలం పేరు. అయితే ఒక దశాబ్ద కాలం నుండి రచనలు చేస్తున్నా ఒక్క పత్రికలోనూ అతని రచనలు ప్రచురించబడకపోవడంతో పట్టువదలని విక్రమార్కుడినీ, గజనీని, ఘోరీని, ఆదర్శంగా తీసుకొని తన రచనా వ్యాసంగాన్ని సుదీర్ఘంగా కొనసాగొస్తున్నాడు.

"ఏమోయ్. విశాఖ పత్రికలో హాస్య కథల పోటీ ప్రకటన వచ్చింది. మొదటి బహుమతి పదిహేను వేలు, మంచి కథ రాసి పంపించు. ఈ దెబ్బతో మొదటి బహుమతి కొట్టేసేవనుకో, రాష్ట్రం దృష్టి అంతా మన ఊరి మీద పడిపోతుంది. నీ కోసం పత్రికా విలేఖరులు, మీడియా అంతా మన ఊరి మీద పడిపోతారు." అన్నాడు సుబ్బారావు.

అందుకు మార్క్ వెంటనే "అలాగే మన దగ్గర బోల్డు కథలున్నాయి. ఒక కథ తీసి మెరుగులు దిద్ది పంపించేస్తానులే అన్నాడు. ఇంతలో.... లోపలి నుంచి కాఫీ పట్టుకుని మార్క్ భార్య వచ్చింది. వస్తూనే సుబ్బారావుతో "అన్నయ్యగారూ మీరైనా చెప్పండి. ఈ పాడురాతలు మానేయమని. కాగితాలు, కవర్లు, పెన్ రీఫిల్స్ కొని స్టేషనరీ షాపు వాళ్ళనీ, కథలు పంపడం, అవి తిరిగి రావడంతో పోస్టల్ డిపార్ట్‌మెంట్ వాళ్లనీ మాబాగా పోషిస్తున్నారీయన. వారానికోసారి వచ్చి మన ఊరి ఫాన్సీ ఎంపోరియం వాడు ఈయన అడిగినా అడగక పోయినా సరే కాగితాలు, కవర్లు, రీఫిల్స్ ఇచ్చి మరీ పోతున్నాడండీ. పోన్లే ఒక్కటంటే ఒక్క రచన అయినా ఏదైనా పత్రికలో వస్తే సంతోషించేదాన్ని. కనీసం ఈయన రాసిన ఉత్తరం కూడా ఏ పత్రిక లోనూ ప్రచురింపబడలేదండీ బాబూ..." అంది ఆమె.

సుబ్బారావు కాఫీ సిప్ చేస్తూ "చూడు చెల్లాయ్ మా వోడు ఇలాగే రచనలు చేస్తూ చేస్తూ వేలకొద్దీ చేసేశాడనుకో ఒక్క రచన కూడా ప్రచురింపబడలేదనుకో ప్రపంచంలో గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ అని ఉంది, నేను అక్కడికి రాసి "వేలాది రచనలు చేసినా ఒక్కటంటే ఒక్కటీ కూడా ప్రచురింపబడని రచయిత" అని శీర్షిక కింద తాటికాయలంత అక్షరాలతో మా వాడి పేరు వేయిస్తాను తెలిసిందా. అప్పుడైనా మన దేశంలోని పత్రికల వాళ్ళు మొత్తం రచనలను పోటీపడి మరీ ప్రచురిస్తారు తెలుసా?" అన్నాడు.

"చాల్లెండి సంబడం. మీకు చెప్పడం పొరబాటైంది. అయినా మిమ్మలని అని ఏం లాభం లెండి. మా ఆయన పిచ్చి నేను కుదుర్చుకోవాలి గాని" అంటూ మూతి ముప్పై వంకర్లు తిప్పుకుంటూ విసవిసా లోపలికి వెళ్ళిపోయింది. రెండు రోజుల తరువాత సుబ్బారావు వచ్చి "ఒరేయ్ పోటీ కథ పంపించేశావా?" అని అడిగాడు మార్క్‌ని.

పంపేశాను. చూశావా ఇవాళ ఒక కథ తిరిగి వచ్చింది. నా రచన కాపీ రచన అని రాశారు". అదెలాగురా ఇన్ని సంవత్సరాల నుండి రచనలు చేస్తున్న నీకు కాపీ చేయాల్సిన అగత్యం ఏమొచ్చింది?" "మా బాగా అన్నావురా. అది కాదురా సుబ్బు నేను కాపీ రచనలు చేస్తున్నానని అందరూ అంటారు. కాని ఒక్కటి అందరూ తెలుసుకోవాలి.

దేశంలో అనేక మంది రచయితలు రచయిత్రులు ఉన్నారు కదా. అందరి బుర్రలోనూ ఒకే రకమైన ప్లాటుకు ఆలోచన రాకూడదని ఎక్కడ ఉంది? బాగా స్పీడుగా రాసే రచయిత గబగబా ముందు రాసేస్తాడు. అది ప్రచురణ అయిపోతుంది. కొంచం బద్ధకంగా ఉన్నవాడు వెనక రాస్తాడు. దానిని కాపీ అంటే ఎలాగురా బాబూ". అన్నాడు మార్క్

"అవును నిజమే, ఇది మాకు తెలియనేలేదు సుమా" అన్నాడు సుబ్బారావు తన మిత్రుడి తెలివితేటలకు అబ్బురపడి.

"దీనికి ఒక్కటే పరిష్కారం. నేను ఒక్క ఆలోచన చేశాను. సాఫ్ట్‌వేర్ బాగా డెవలప్ అయింది కదా. దీనికి ప్రత్యేకంగా ఒక ప్రోగ్రాం తయారు చేసి ప్రతీ రచయితా తనకు తట్టిన కథ యొక్క ప్లాటును వెంటనే ఆ ప్రోగ్రాంలోకి ఫీడ్ చేసి కంప్యూటర్‌లో కొత్తగా ఒక్క వెబ్‌సైట్‌లో ఉంచాలి, ఆ వెబ్‌సైట్‌లో రచనల ప్లాటులు మాత్రమే ఉంటాయి. అప్పుడు రచన చేయాలనుకున్న ప్రతి రచయితా ఇంటర్‌నెట్‌లో ఆ వెబ్‌సైట్ రిఫర్ చేసి మాత్రమే రచన చేయాలి. అప్పుడు కాపీ రచనలు వచ్చే ఆస్కారమే ఉండదు." అంటున్న మార్క్‌ని ప్రశంసాపూర్వకంగా చూస్తున్నాడు సుబ్బారావు.

"అరేయ్. ఏమిటో అనుకున్నాను గానీ నీ బుర్ర ఇన్స్యూర్ చేయాల్సిందేరోయ్. నిన్నూ నీ రచనలనూ వినియోగించుకోలేని పత్రికా రంగం సిగ్గుపడాలి రా" అన్నాడు సుబ్బారావు.

దానికి వెంటనే మార్క్ కాలర్ పైకి ఎగరేసి భుజాలు పైకి ఎగరేసి, బక్కగా పీలగా ఉన్నవాడు కాస్తా పీపాలాగా కొంచం ఉబ్బినట్లుగా కనిపించాడు. అతని ముఖంలో కొంచెం గర్వం, కొంచం సంతోషం, వాటితో పాటే తన రచనలు ప్రచురణ జరగడం లేదన్న ఆవేదన మిక్స్ అయిపోయి కనిపించాయి.

"అందుకేరా సుబ్బూ ఇవాళ పోటీకి కథ పంపిస్తూ ఫస్ట్ పేజీ మీద "చట్టబద్ధమైన హెచ్చరిక" అని వ్రాసి పంపించాను తెలుసా?" అన్నాడు మార్క్ ముఖం నిండా ఆనందం పులుముకొని. వెంటనే సుబ్బారావు "అదేమిట్రోయ్. ఇదే మొదటిసారి వింటున్నాను. అదేదో హామీపత్రం రాస్తారుట కదా కథతో పాటు.." అన్నాడు.

"అది మామూలేరా సుబ్బూ అది కాకుండ నేను స్పెషల్‌గా రాశాను. నేను రాసిన కథ చదివే న్యాయనిర్ణేతలు కడుపుబ్బేలా నవ్వి పొట్ట చెక్కలవ్వడం ఖాయం కాబట్టి, ఆ విధంగా నవ్వడం వలన వారి గుండె ఆగిపోవడం గానీ జరిగే ప్రమాదం ఉంది. అందువలన నా కథ న్యాయనిర్ణేతలు చదివేటప్పుడు వారి ప్రక్కనే ఒక జనరల్ డాక్టర్‌నీ, ఒక హార్ట్ స్పెషలిస్ట్‌నీ ఉంచుకోవలసిందనీ" హెచ్చరిక రాశాను.

"అదేమిట్రా నీ బొంద?" అన్నాడు ఆశ్చర్యంతో సుబ్బారావు. హాస్యం పండించడంలో నేను పంపిన కథ 'న భూతో న భవిష్యతి' అలాంటి రచన ఇంతవరకూ రాలేదనుకో. ఒక వేల నా కథ చదివేటప్పుడు న్యాయనిర్ణేతలు నవ్వి నవ్వి గుండె ఆగి స్వర్గస్థులయ్యారనుకో, అప్పుడు నా మీద కేసు వస్తుంది కదా. అందుకని ముందు జాగ్రత్త చర్య అన్నమాట." అంటున్న మార్క్ మాటలకు అడ్డువచ్చి సుబ్బారావు "యూ ఆర్ గ్రేట్ రా - నువ్వు నా చిన్ననాటి స్నేహితుడు కావడం నాకు చాలా గర్వంగా ఉంది" అన్నాడు.

ఇంతలో మార్క్ "మళ్ళీ కలుద్దాం రా. నాకు బుర్రలో ప్లాట్లు దొలిచేస్తున్నాయి పేపర్ మీద పెట్టేయాలి" అంటున్న మార్క్‌ని భుజం మీద చేయి వేసి "మిత్రమా పట్టువదలకు విజయం నీదే" అంటూ వెళ్ళిపోయాడు సుబ్బారావు. వి.కే. మార్క్ రచన వ్యాసంగం ఇలా రోజూ ఒక కథ పోస్టులో వేయడం, రెండ కథలు పోస్ట్‌మెన్ భద్రంగా తీసుకురావడం జరుగుతుండగా, రోజులు గడుస్తున్నాయి.

ఒక రోజు రిజిస్టర్ పోస్ట్‌లో ఒక కవరు వచ్చింది. అది మొదటి బహుమతి పది వేల రూపాయలు ప్రకటించిన పత్రిక నుండి "అది సంగతి దెబ్బకి దెయ్యం దిగి వచ్చింది. మన హెచ్చరిక బాగా పని చేసింది. మొత్తానికి బహుమతి ఇచ్చేశారు" అనుకుంటూ మార్క్ కవరు తెరిచాడు. అందులో-

సితార గారికి నమస్కారం.. మీరు మా పత్రికకు చాలా కాలంగా నిరాటంకంగా రచనలు పంపిస్తున్నందుకు కృతజ్ఞతలు!

మీ రచన మొదటి పేజీలో మా క్షేమం కోరి హెచ్చరిక రాయడంతో మేము ప్రాథమిక పరిశీలన దశ నుండి మీ రచన చదివే వారి ప్రక్కనే డాక్టర్ల టీమ్‌ని ఏర్పాటు చేశాం. అయితే.. మీ రచన చదివినవారికి అతిగా నవ్వు రాలేదు సరికదా ఆయన ముఖంలో ఏ రకమైన హావ భావాలు కనిపించకపోవడంతో పది మంది చేత కితకితలు పెట్టించాము. ఆయనకు కితకితలు ఎక్కువేలెండి. అయినా సరే ఆయన చలించనేలేదు పైగా మీ కథ చదివిన వారిని మామూలు స్థితికి తీసుకురావడానికి సూపర్ స్పెషాలిటీకి తరలించాము. డాక్టర్లు తమ కృషి చేస్తున్నారు. ఇక పోతే మీ కథ గత పదిహేను సంవత్సరాలుగా వచ్చిన కామెడీ కథలలోంచి ముక్కలు తీసి ఇప్పుడు వస్తున్న తెలుగు సినిమాల్లాగ అతుకుల బొంత తయారు చేశారు. నేర్పుగా, ఏ కథలోంచి ఎంత భాగం మీరు తీసుకున్నారో, మా సంపాదక వర్గం శ్రమించి తయారు చేసిన పట్టిక ఈ ఉత్తరంలో జతపరిచాము.

మీ నుండి ప్రచురణార్హమైన రచన కోసం ఎదురు చూస్తూ... సంపాదక వర్గం.

ఉత్తరం చదివేక సితార ఉరఫ్ మార్క్ ముఖం ఎన్ని రంగులను సంతరించుకుందో వర్ణించనలని కాదు. పై నుండి కిందకు పది సార్లు చదివాడు ఉత్తరాన్ని తన రహస్యాన్ని వీళ్ళు ఎలా ఛేదించారా అని. ఇంతలో వంటింట్లో పనిలో బిజీగా ఉన్న మార్క్ భార్య తన భర్త గదిలో చడీ చప్పుడు లేదేమిటని గబ గబా వచ్చి చూసి "పోస్ట్‌మేన్ వచ్చేడు ఏమైందండీ" అంది.

పిచ్చి చూపులు చూస్తున్న అతని ముఖం మీద చేతిలో ఉన్న గ్లాసుడు నీళ్ళు విసురుగా జల్లింది. వెంటనే మార్క్ తల విదిలించుకుంటూ " అదేంటలా చేశావ్" అన్నాడు. "మరేంటి? అలా చలనం లేకుండా కూర్చుండిపోయారు భయపడి చచ్చాను. ఏం చేయాలో పాలుపోలేదు".

"అదా గిన్నీస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో నా పేరు రికార్డు అయ్యే సమయం దగ్గర పడింది. పాలేరు చేత సుబ్బుకి కబురు చెయ్యి" అన్నాడు మార్క్. "అలాగే.." అనుకుంటూ బయటకు వెళ్తూ "ఈ పిచ్చి మేళంతో ఎలా వేగాలో ఏమో, ఈ పిచ్చి కుదరడానికి వైద్యం ఏదైనా ఉందేమో కనుక్కోమని నాన్నకు కబురు చెయ్యాలి" అనుకుంటోంది వి.కె.మార్క్ శ్రీమతి.

ఇంతకీ అసలు విషయం వి.కె.మార్క్ పూర్తి పేరు విక్రమార్కుల సుబ్బారావు.

**(హంసిని వెబ్ మేగజైన్, జూలై 2010)**